# 53

# నీవు ప్రత్యేకమైనవాడవు!

## (12:3-8)

నీ యెదుట టేబుల్ మీద ఒక కాగితపు ముక్క పడియుందనుకో. “ఒక వ్యక్తిని ప్రత్యేకమైనవానిగా దిద్దే విషయాల ప్రక్కనే రైటు గీత పెట్టు” అనే మాటలు దాని పై భాగంలో ఉన్నాయి. దాని క్రింద ఉదహరించిన జాబితా ఉంది[1] అందులో యివి చేర్చబడ్డాయి:

సౌందర్యవతి లేక అందగాడివైయుండుట.
ఎక్కువ డబ్బు మరియు ఎక్కువైన సొత్తు కలిగియుండుట.
ప్రజాభిమానం కలిగి; ప్రతివానికి యిష్టుడైయుండుట.
ఇతరులపై అధికారమును పెత్తనమును కలిగియుండుట.
వినోదం కలిగించే లేక రాజకీయ వ్యక్తిత్వం కలిగియుండుట.
నీ పటం వార్తాపత్రికల్లోను వార, మాస పత్రికల్లో రావడం.

ఆ జాబితా అంతటి క్రింద కడాపటిగా:

దేవుని బిడ్డవైయుండుట.

వీటిలో దేని ప్రక్కన నీ అంగీకారపు ముద్ర వేస్తావు? లోక సంబంధమైన మనస్సు గల వ్యక్తికి ఏది “ప్రత్యేకంగా” కన్పిస్తుందో ఆలోచించు. మనం శ్రద్ధ చూపకుంటే, లోకరీతిని విలువలను గ్రహించకుండానే అంగీకరించే ప్రమాదం ఉందని మనం గత పాఠంలో గుర్తించాం. “నూతనపరచబడిన” మనస్సు కలిగియుండాలని (రోమా 12:2), ప్రతిదానిని మనం నూతనంగా చూడవలసియుందని పౌలు మనలను పోటీకి పిలిచాడు.

నీవు దేవుని బిడ్డవైతే, నీవు ప్రత్యేకమైన వ్యక్తివని ఈ మూల వాక్యంలో పౌలు చెప్పాడు. నీవు ప్రత్యేకమైన వ్యక్తివని రుజువు చేయడానికి పౌలు అనేక రుజువులను చూపియుండేవాడే. దేవుడు నిన్ను నిర్మించాడని నీవు ప్రత్యేకమైనవాడవనే వాస్తవాన్ని అతడు చెప్పియుండేవాడే. “సృష్టికి నకిలీలు లేవు.”[2] నీకు ఎంత ప్రత్యేకత ఉందంటే, క్రీస్తు నీ కొరకు చనిపోయారు. దేవుని కుమారుడు “నన్ను ప్రేమించి నా కొరకు తన్నుతాను అర్పించుకున్నారని” నీవు పౌలుతో కలిసి చెప్పవచ్చు (గలతీయులకు 2:20; నొక్కి చెప్పింది నాది). ఏదియెలాగున్నా, పౌలు మాటల్లోనుండి మనం గ్రహించే

రుజువేమంటే, నీవు ప్రత్యేకమైనవాడవనడానికి సంఘం పనికి అవసరమైన ప్రత్యేక వరాన్ని దేవుడు నీకు అనుగ్రహించాడు.

## దేవుడు నీకొక ప్రత్యేకమైన వరమనుగ్రహించాడు ... (12:3-6బి)

**ఉపదేశం (3 వచనం)**

పౌలు యిలా ఆరంభించాడు, "తన్నుతాను ఎంచుకొన తగినదానికంటె ఎక్కువగా ఎంచుకొనక, దేవుడు ఒక్కొక్కనికి విభజించి యిచ్చిన విశ్వాస పరిమాణప్రకారము, తాను స్వస్థబుద్ధిగలవాడగుటకై తగినరీతిగా తన్ను ఎంచుకొనవలెనని, నాకు అనుగ్రహింపబడిన కృపనుబట్టి మీలోనున్న ప్రతివానితోను చెప్పుచున్నాను" (3 వచనం). "నాకు అనుగ్రహింపబడిన కృపనుబట్టి" అనే ప్రయోగం పౌలు యొక్క అపొస్తలత్వాన్ని సూచిస్తుంది. అది అతనిమీద కృపవలన అనుగ్రహింపబడింది (రోమా 1:5; 15:15, 16; గలతీయులకు 2:7-9 చూడు). వ్యక్తిగత యోగ్యతనుబట్టి తాను అపొస్తలుడు కాడని, దేవుని మహా కృపనుబట్టియే అది తనకు లభించిందని పౌలు గ్రహించాడు.

(1) ఎక్కువగా ఎంచుకొనక. కృపవలననే అపొస్తలుడైనందున, "తన్నుతాను ఎంచుకొన తగినదానికంటె ఎక్కువగా ఎంచుకొనక; స్వస్థబుద్ధిగలవారైయుండాలని" పౌలు తన పాఠకులను కోరాడు (రోమా 12:3బి). పౌలు ఆంగ్లంలో అంత స్పష్టంగా లేని మాటలతో గారడీ చేసాడు. ఇప్పుడు కోట్ చేయబడిన భాగంలో "ఎంచుకొనుట" (*phroneo*) అనే పద రూపాలు నాలుగుసార్లు కన్పిస్తాయి. *Phroneo* అనేది రెండుసార్లు ఉపయోగింపబడింది. దానికి తోడు, *huperphroneo phroneo* అనేదానికి ముందు *huper* ["పైగా" లేక "ఎత్తుగా"], అంటే "తన్నుగూర్చి గొప్పగా తలంచుట" అని అర్థం. చివరిగా, అతడు *sophroneo* (*phroneo*కు ముందు *sozo* ["రక్షించుటకు"]) "స్వస్థ బుద్ధి కలిగియుండుట" అనే అర్థం యిస్తుంది, దానివలన "ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుంది."[3] ఈ మూల వాక్య భాగాన్ని యిలా తర్జుమా చేయవచ్చు, "[నిన్నుగూర్చి నీవు] గొప్ప తలంపులు తలంచకు. అయితే [నిన్నుగూర్చి నీవు] ఆరోగ్యకరమైన తలంపులు తలంచు." "నీ సొంత ప్రాముఖ్యతను గూర్చి అతిశయ భావాలు కలిగియుండవద్దని నేను నీకు చెప్పుతున్నాను. దానికి బదులు, ఆరోగ్యకరమైన అంచనా నిన్నుగూర్చి నీవు పెంపొందించుకో" అని CJB అంటుంది.

దేవుడు మనలను విజయంతో దీవించితే, గర్వంతో నింపబడే అపాయాన్ని మనం ఎదుర్కోవచ్చు. మన వరాలను ఉపయోగించడంలో యితరులకంటే "ఎక్కువ శ్రద్ధ గలవారమై" ఉన్నామనే గర్వంతో సహా మనం నింపబడవచ్చు. మనలను గూర్చి మనం అధికంగా ఆలోచించకుండునట్లు దైవికమైన ఏ జాగ్రత్త మనకు సహాయం చేయగలదు? "విశ్వాస పరిమాణాన్ని దేవుడే ఒకొక్కనికి విభజించి యిచ్చాడని" మనం గ్రహించవలసియుంది (3సి వచనం; నొక్కి చెప్పింది నాది). దేవుడు మహిమకు పాత్రుడు; మనం కాదు.

"విశ్వాస పరిమాణమనేది" కొంతవరకు తేటగా లేని ప్రయోగమైయుంది. "పరిమాణమనేది" *metron* నుండి వచ్చింది. "కొలతవేసే పరికరాన్ని" లేక "కొలతవేసిన ఒక భాగాన్ని సూచించవచ్చు."[4] మొదటి నిర్వచనం పౌలు మనస్సులో ఉన్నట్టు, ప్రమాణం అని కొందరు తలంచుతారు. దేవుడు మనకు విశ్వాస ప్రమాణాన్ని ప్రసాదించాడు, దానివలన మనలను మనమే కొలుచుకోవచ్చు. ఆ కొలపరిమాణాన్ని ఉపయోగించి, మనలను మనమే కొలిచి చూచుకొన్నప్పుడు, మనం ఎంత లోటుపడియున్నామో చూచు కుంటాం. అప్పుడు గర్వం మాయమైపోతుంది. అయినా, కొందరు రెండవ నిర్వచనాన్ని నమ్ముతారు - ఒక భాగం - ఆ సందర్భంలో యిది బాగా పెనవేసుకుంటుంది. దేవుడు ప్రతి క్రైస్తవునికి దీవెనలలో వాని వంతును వానికనుగ్రహించాడు. ఇది వచనం 6తో సరిపోతుంది: "మన కనుగ్రహింపబడిన కృపచొప్పున వెవ్వేరు కృపావరములు కలిగినవారమైయున్నాము."

అప్పుడు "విశ్వాసము" (*pistis*) అనే పదముంది. ఈ పదం పత్రికలో ప్రాధాన్యత కలిగియుంది, అయితే యిక్కడ అది కొంచెం వ్యత్యాసంగా ఉపయోగించబడింది. ఈ లేఖన భాగంలోని "విశ్వాసమనేది" సువార్తకు, మన వ్యక్తిగత విధేయతకు సంబంధించింది కాదు (రోమా 1:16; 10:17) దేవుని కృపను యిది వ్యక్తపరచుటయై ఉంది. దేవుని వరములు విశ్వాసంవలన ఉపయోగింపబడియున్నందున, వచనం 3లో సూచింపబడిన "విశ్వాసము" (వాక్యంతో చేర్చి) మనకు అవసరమైన దేనినైనా దేవుడు సరఫరా చేయునట్లు మనం తలంచవచ్చు. ఆలాగే ఆత్మ సంబంధమైన వరముల జాబితాను పేతురు యిచ్చినప్పుడు, అతడిలా అన్నాడు, "ఒకడు ఉపచారము చేసినయెడల దేవుడనుగ్రహించు సామర్థ్యమునొంది చేయవలెను" (1 పేతురు 4:11బి; నొక్కి చెప్పింది నాది).

"విశ్వాస పరిమాణమనే" ప్రయోగం యొక్క అర్థంతో వణకిపోవద్దు. దానివలన పౌలు అర్థం ఏమైయున్నా, దేవుడు దీనిని మనకు విభజించి యిస్తాడు. గనుక వ్యక్తిగత అతిశయానికి తావులేదు. పౌలు చేసినంతగా మరెవ్వరూ రాజ్యంకొరకు అంతగా సాధించి యుండకపోవచ్చు; అయితే అతడిలా అన్నాడు, "అయినను నేనేమైయున్నానో అది దేవుని కృపవలననే అయియున్నాను" (1 కొరింథీయులకు 15:10ఎ).

(2) అంత హీనంగా కూడ కాదు. క్రైస్తవులు తమ్మును గూర్చి అతిగా తలంచ కూడదనేది వచనం 3లో పౌలు యొక్క ప్రత్యేకమైన అక్కరయైయుంది. "స్వస్థ బుద్ధిగల వాడగుటకై తగినరీతిగా [తన్ను] ఎంచుకొనవలెననే" హెచ్చరికలో, దానికి వ్యతిరేకమైన కడకు కూడా వెళ్లవద్దనే భావమైయుంది. క్రైస్తవుడు తన్నుగూర్చి తాను హీనంగా కూడ తలంచకూడదు. ఇతరులకంటె తాను శ్రేష్ఠుడని ఎవడును తలంచకూడదు. అయితే, క్రైస్తవుడు పనికిమాలినవాడైయున్నట్టు తన్నుగూర్చి తలంచకూడదు. "దేవుడు ప్రతివానికి విశ్వాస పరిమాణాన్ని వేరుగా యిచ్చినట్టు" పౌలు చెప్పాడు. దేవుడు ఎవనినే విడిచి పెట్టలేదు. తన పిల్లలందరికి ఆయన వరములనిచ్చియున్నాడు. కానరాని అతిశయం విషయమై మనం జాగ్రత్తగా ఉండాలి. ఆగే సమయంలో మనకు అనుగ్రహింపబడిన వరములను ఉపయోగించుటకు ఆటంకం కలిగించే తప్పుడు అణకువను కూడ మనం

తొలిగించవలసియుంటుంది.

**ఉదాహరణ (4–6బి వచనాలు)**

పౌలు తన ఉపదేశాన్ని తాను తరచుగా ఉపయోగించే ఉదాహరణతో వెంటాడు తున్నాడు. 4, 5 వచనాలలో సంఘాన్ని అతడు మానవ దేహంతో పోల్చాడు:

> ఒక్క [భౌతిక] శరీరములో మనకు అనేక అవయవములుండినను, ఈ అవయవము లన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో,[5] ఆలాగే అనేకులమైన మనము [క్రైస్తవులం] క్రీస్తులో [ఆత్మ సంబంధమైన] ఒక్క శరీరము [సంఘము; ఎఫెసీయులకు 1:22]గా ఉండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములమైయున్నాము (1 కొరింథీయులకు 12:27; కొలొస్సయులకు 1:18, 24 చూడు).

ఈ పోలికనుండి అనేక వర్తింపులు చేయవచ్చు (1 కొరింథీయులకు 12:12–27[6] చూడు). ఉదాహరణకు, మనము మన వరములను శరీరము/సంఘము సందర్భంలో అభ్యాసం చేస్తామని పౌలు తేటపరచాడు. ఇది చేయడానికి గాను, మనము స్థానిక సంఘంలో చురుకుగా ఉండాలి. మన మూల వాక్యంలో చెప్పబడిన లేక గుప్తం చేయబడిన యితరమైన పలు వర్తింపులను పేర్కొంటాను. నేను వీటిని ప్రస్తావించుచుండగా, మానవ శరీరాన్ని నీ మనస్సులో చిత్రించుకో.[7]

(1) శరీరములో ప్రతి అవయవానికి ఒకటో లేక ఎక్కువో వరాలు (పనులు) ఉంటాయి; ఏదియు విడిచిపెట్టబడదు. వచనం 6 యిలా అంటుంది, “మన కనుగ్రహింప బడిన కృపచొప్పున వెవ్వేరు కృపావరములు కలిగినవారమై యున్నాము.” అయితే ఈ వరములేమిటి? దేవుడు మనకు అనుగ్రహించిన తలాంతులు మరియు సామర్థ్యాలను ఎక్కువమంది తలంచుతారు. పౌలు మనస్సులో ప్రాథమికంగా యిది ఉండియుండ వచ్చు. బహుశ, దేవుడు మనకు అనుగ్రహించిన తలాంతులు, సామర్థ్యాలు ప్లస్ వాటిని ఉపయోగించుటకు అవసరమైనవన్ని ఆయన కృపావరాలే అని మనం తలంచాలి.

(2) వరములు/పనులు అన్నీ ఒక్కటే కాదు. వచనం 6 వైపు మరోసారి చూడు: “మనకనుగ్రహింపబడిన కృపచొప్పున వెవ్వేరు కృపావరములు కలిగినవారమై యున్నాము” (నొక్కి చెప్పింది నాది). కంటి పనికి, చెవి పనికి వ్యత్యాసముంది; చెయ్యి పని, పాదము యొక్క పని ఒక్కటే కాదు.

సంఘంలోని “వివిధమైన” విశ్వాసాలను మరియు “యితరుల భావాలపట్ల” సహనం కలిగియుండడాన్ని గూర్చి మాట్లాడడానికి మన మూల వాక్యంలోని ఈ భాగాన్ని అనేకమంది రచయితలు ఉపయోగించారు. పౌలు వివిధములైన విశ్వాసాలను గూర్చి మాట్లాడలేదు, గాని వివిధములైను పనులను గూర్చి మాత్రమే మాట్లాడుతున్నాడు. అధ్యాయాలు 14, 15ల్లో ఒకరి అభిప్రాయాలను ఒకరు సహించాలని అతడు నొక్కి చెప్పాడే గాని, విశ్వాసానికి సంబంధించిన విషయమేమి? దోషాన్ని సంహించమనేదాన్ని పౌలు నమ్మాడా? 16:17లో అతడిలా అంటున్నాడు, “సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగజేయువారిని కనిపెట్టి

యుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి."

మన చర్చకు తిరిగి వద్దాం: సంఘంలోని సభ్యులకందరికి ఒక్కటే వరము/పని లేదు. కన్నును వాసన చూడమని గాని, చెవిని చూడమని గాని ఎదురు చూడం. మనలో ఎక్కువమంది కాళ్లతో వస్తువులు తీసికొనడం గాని, చేతులతో నడవడం గాని చేయం. అయినా, సంఘంలో ఉన్నవారినందరిని ఒకే పని చేయాలని మనం కొన్నిసార్లు ఎదురు చూస్తూ ఉంటాం. "చెవియైన" సభ్యుని సరిగా "చూడనందుకు" కొన్నిసార్లు మనం శిక్షిస్తాం. వివిధ కార్యములను మనం గుర్తించవలసియుంటుంది.

(3) ప్రతి వరము/కార్యము ప్రాముఖ్యమైనది. మానవ దేహంలోని కొన్ని భాగాలు తక్కినవాటికంటె ఎక్కువ శ్రద్ధను పొందుతాయి, కాని దేహ క్షేమం కొరకు, సౌఖ్యం కొరకు అన్నియు అవసరమైనవే. తన భౌతిక దేహంనుండి ఒక అవయవము తుంచివేయబడిన వ్యక్తిని నీవు ఎరుగుదువా? తన దేహంలో కొన్ని అవయవాలు పని చేయక రోగ శయ్యమీద పరుండిన మనిషిని నీవు ఎరుగుదువా? అప్పుడు నా భావమేమో నీవు గ్రహించుకోగలవు.

మా కుటుంబం ఆస్ట్రేలియాలో నివసిస్తూ పని చేస్తున్నప్పుడు, నా సహోదరుడు Coy ఒక సంవత్సరంపాటు USలో గడిపాడు. ఆ సంవత్సరం Macquarie School of Preachingను నేను డైరెక్ట్ చేస్తూ, Coy చెప్పిన ప్రీచింగ్ క్లాసు నేను ఉపదేశించాను. Visual aids ఉపయోగించి ప్రసంగం చేయడమనే ఎసైన్‌మెంట్ (పనిని) నేను విద్యార్థులకిచ్చాను. ఎక్కువమంది విద్యార్థులు చార్టులు, మరియు యితర టీచింగ్ ఎయిడ్స్ తయారు చేశారు. Don Males కనబడే ఏ ఎయిడ్ లేకుండ క్లాసుకు వచ్చాడు. రోమా 12 మరియు 1 కొరింథీయులకు 12లను మూల వాక్యంగా ఎంచుకొని మానవ దేహము యొక్క అవయవాలను గూర్చి మాట్లాడాడు. "ప్రతి అవయవము ముఖ్యమైనదే" అని అతడన్నాడు. అప్పుడు తన చెయ్యి పైకెత్తి, అతడిలా అన్నాడు, "ఉదాహరణకు, నా చేతిలో ఉన్న ప్రతి వ్రేలు ముఖ్యమైనదే. బొటనవ్రేలు, మధ్యవ్రేలు ముఖ్యమైనవే. వస్తువులను పట్టి తీసికొనడానికి అవి సహాయం చేస్తాయి. మూడవ వ్రేలిపై ఉంగరం పెట్టుకుంటాం." తరువాత అతడు తన చిటికెన వ్రేలును పైకెత్తాడు. "ఈ చిటికెన వ్రేలు సంగతి ఏమిటి? ఇది దేనికి పనికి వస్తుంది?" అని అతడు కొంతసేపు ఆగి, "నీ చెవి ఎప్పుడైనా దురదగా ఉండిందా?" అని అడిగి తన చిటికెన వ్రేలును చెవిలో పెట్టి త్రిప్పి చూపాడు. ఒక నిట్టూర్పు విడిచినట్టు విడిచి, "అవును, ప్రతి అవయవము ముఖ్యమైనదే!" అని అన్నాడు.

"ఒకరికొకరము ప్రత్యేకముగా అవయవములమైయున్నాము" అంటూ పౌలు వచనం 5ను ముగిస్తున్నాడు. "ఒకరికొకరము భాగములమైయున్నాము – [ఒకరి మీద ఒకరం పరస్పరం ఆధారపడియున్నాము]" అని AB అంది. నా దేహంలోని ఒక అవయవానికి నా దేహంలోని అన్ని అవయవాలు ఎలా అవసరమైయున్నాయో, ఆలాగే ఆత్మ సంబంధమైన దేహానికి (సంఘానికి) ఆ దేహంలోని తక్కిన అవయవములన్నియు అవసరమైయున్నాయి. ముఖ్యం కాని అవయవములు లేవు, ముఖ్యం కాని వరములు లేవు.

(4) మనకు ప్రసాదింపబడిన ప్రతి వరము ఉపయోగించవలసి ఉంది. వచనం

6 మరోసారి చదువు: "కృపావరములు కలిగినవారమైయున్నాము గనుక ... మనలో ప్రతి ఒక్కరము పని కలిగియుందము." దీన్ని గూర్చి తరువాత ఎక్కువగా మాట్లాడుదాం.

## ... గనుక దాని కనుగొను ... (12:6సి-8)

"దేవుడు నాకు వరము అనుగ్రహించియున్నట్టయితే, అది ఏమైయుంటుంది? నా వరమేదో నేనెలా కనుగొనగలను?" అని యిప్పటికే నీవు తలంచుతుండవచ్చు.

**ఒక జాబితా**

వచనాలు 6నుండి 8వరకు, ఏడు వరముల జాబితాను పౌలు యిచ్చాడు: ప్రవచించుట, పరిచర్య, ఉపదేశించుట, హెచ్చరించుట, పంచిపెట్టుట, పై విచారణ చేయుట, కరుణించుట. బైబిలులోని అనేక జాబితాలవలె, యిది కూడా అన్ని వివరములు కలిగినది కాదు. "అసాధారణమైన" (అద్భుతమైన) "సాధారణమైన" (అద్భుతములు కాని) వరములు 1 కొరింథీయులకు 12:8–10, 28; ఎఫెసీయులకు 4:11; మరియు 1 పేతురు 4:11వంటి యితర జాబితాలున్నాయి. రోమా 12లో కన్పించే పదాల్లో కొన్ని ("పరిచర్య" వంటివి) 6నుండి 8 వచనాల్లో దేవుడు మనకు అనుగ్రహించినలాంటివి సాధారణంగా మనకు కనిపిస్తాయి.

12:6–8ల్లోని ఏడు వరాలను మనం చర్చించక ముందు, ఈ వరముల యొక్క స్వభావాన్ని మనం ఆలోచించవలసియుంటుంది. మొదటిది ("ప్రవచించడం") "అసాధారణమైన" (అద్భుతమైన) వరం. తక్కినవి "సాధారణమైన" (అద్భుతములు కాని) రకానికి చెందినవి కావచ్చు.[8] సమస్తమును దేవునివలననైనవైయున్నందున, మొదటి శతాబ్దపు రచయితలు ఈ రెండింటి మధ్య సాధారణంగా తేటైన విభజన చేయనట్లున్నారు. సహజమైన తలాంతులు గలవారికి ఆ విషయంలో దేవుడు అద్భుత శక్తులను యిచ్చియుండ వచ్చునని R. C. Bell అభిప్రాయపడ్డాడు. సంపూర్ణంగా వాక్యం వచ్చినప్పుడు, అద్భుత శక్తులు లేకుండ సంఘం యొక్క పనిని యథావిధిగా కొనసాగించారు.[9] మనం అద్భుతాలు జరిగే కాలంలో లేం, అయితే అద్భుతం కాని మన వరములు దేవునినుండి కలిగినవేయని మనం గుర్తించవలసియుంటుంది (యాకోబు 1:17). ఇప్పుడు ఏడు వరములను క్లుప్తంగా చూద్దాం.

(1) ప్రవచించు వరం. "ప్రవక్త" (*prophetes*) అంటే "మరొకనికొరకు మాట్లాడే వాడు" అని అర్థం *phemi* ["చెప్పుట"] అనేదానికి ముందు *pro* ["ఎదుట"]).[10] క్రొత్త నిబంధన (రచనా) కాలంలో, ప్రవక్తలు ప్రేరేపింపబడినవారై దేవుని కొరకు మాట్లాడారు (అపొస్తలుల కార్యములు 11:27; 13:1; 15:32; 1 కొరింథీయులకు 12:28; ఎఫెసీయులకు 2:20; 4:11 చూడు). వారి సందేశాన్ని "ప్రవచనము" (*propheteia*) అని అన్నారు. నేడు మనకు ప్రేరేపించబడిన ప్రవక్తలు లేరు. అయితే వారి సందేశంలో అవసరమైన భాగాన్ని దేవుడు క్రొత్త నిబంధనలో భద్రపరచాడు.

ప్రవచించు వరానికి సంబంధించి నేడు వర్తింపజేసే ఒక అవకాశమేమంటే,

కొందరికి వాక్యాన్ని బహిరంగంగా ప్రసంగించగల శక్తిని దేవుడు ప్రసాదించాడు – అంటే ఒక రకంగా "దేవుని కొరకు మాట్లాడడం." (ప్రతివానికి ఈ సామర్థ్యం లేదు. శరీరమనే ఉదాహరణను మనం ఉపయోగించితే, ప్రతివానిని నోరుగా ఉండేలా దేవుడు చేయలేదు.)

(2) పరిచర్య చేసే వరం. పౌలు యొక్క తరువాత పదం *diakonia* నుండి వచ్చింది, అంటే "సేవ" లేక "పరిచర్య." సంబంధించిన పదాలలో *diakonia* ("పరిచారకుడు" లేక "సేవకుడు") మరియు *diakoneo* ("పరిచర్య చేయడం" లేక "సేవ చేయడం"). సంఘంలోని ప్రత్యేక పరిచర్యలకు కొన్నిసార్లు ఈ పదాలు సూచించబడతాయి, పరిచారకుల పనివంటి దాన్ని (1 తిమోతి 3:10, 13) లేక ప్రసంగీకులు (1 తిమోతి 4:6; 2 తిమోతి 4:5). ఎలాగైనా, ఎక్కువసార్లు, మరొకరికి చేసే ఏ సేవనైనా అవి సూచిస్తాయి (అపొస్తలుల కార్యములు 19:22; రోమా 15:25; 2 తిమోతి 1:18; ఫిలేమోను 13; హెబ్రీయులకు 6:10). 1 కొరింథీయులకు 12:5 యొక్క భాషను అప్పు తెచ్చుకుంటే, "పరిచర్యలు నానావిధములుగా ఉన్నవి" (NIV). (అది ఏదైనా సరే) ఒక విషయం ఎలా చేయాలో అనే నేర్పు కొందరికి ఉంటుంది.

(3) ఉపదేశించు వరం. "ఉపదేశించు" అనేది *didasko* అనే క్రియా రూపం నుండి వచ్చింది – అంటే "ఉపదేశం యిచ్చుట"[11] ఇతరులకు సందేశం అందించ డంలో కొందరు సామర్థ్యం కలిగియుంటారు.

(4) హెచ్చరించు వరము. "హెచ్చరించు" అనేది *parakaleo* నుండి వచ్చింది ఇది భావగర్భితమై ఉంది. ఇది మిశ్రిత పదమైయుంది *para* ("ప్రక్కనే") *kaleo* ("పిలుచు") అనేదానితో మిశ్రితమైయుంది. సహాయముకొరకు[12] "ప్రక్కకు రమ్మని మరొకని పిలుచుట" అనేది భావం. *Parakaleo*ను "హెచ్చరించు," "ప్రోత్సహించు," "ఆలోచన చెప్పు" లేదా "బలపరచు" అని కూడ తర్జుమా చేయవచ్చు. ప్రోత్సహించి, యితరులకు ఉద్దేశం కలిగించే తలాంతు కొందరికి ఉంటుంది.

(5) ఇచ్చు వరము. తరువాత పౌలు "యిచ్చువానిని గూర్చి" మాట్లాడాడు. అతడు యిక్కడ ఉపయోగించిన పదం *metadidomi* (*didomi* ["ఇచ్చుట"] దానికి ముందు *meta* ["తో"]). "పంచుకొను"[13] అని దాని అర్థం. "ఇతరుల అక్కరల నిమిత్తము సమర్పించుట" అని NIV అంది. ఇచ్చుట వరము అంటే వింతగా తోచవచ్చు, కాని అలా చేయుటకు దేవుడు సామర్థ్యం కలిగించాడని జ్ఞాపకముంచుకో. నీవు యివ్వ గలిగావంటే, ముందుగా నీకు డబ్బును లేక సొత్తును యిచ్చాడని దాని అర్థం. ఇవ్వడమనే వరం డబ్బు సంపాదించగల సామర్థ్యాన్ని ముందు ఊహిస్తుంది. కొందరికి డబ్బు సంపాదించే తలాంతు ఉంటుంది, కొందరికి ఉండదు. అతి ముఖ్యమైనవాటిని అలక్ష్యం చేయనంతవరకు, స్వార్థపరమైన విలాసాలకు వాడనంతమట్టుకు డబ్బును సంపాదించ డంలో తప్పేమీలేదు (1 తిమోతి 6:9, 10, 17–19తో పోల్చి చూడు).

(6) నడిపించు వరము. "నడిపించుట" అనడానికి గ్రీకు పదం *proistemi*, అంటే, "ఎదుట నిలబడుట" (*histemi* ["నిలుచుట"], దీనికి ముందు *pro* ["ముందు"]). *Proistemi* "నడిపించు," "ఏలు," "మేనేజ్." తమ్మును వెంబడించేలా

జనులను పురికొల్పడానికి కొందరికి సహజమైన తలాంతు ఉంటుంది. "అతడు సహజ సిద్ధమైన నాయకుడు" అనే మాటలు మా ప్రాంతంలో వాడతారు. ప్రాథమికంగా సంఘ నాయకులు పౌలు మనస్సులో ఉండియుండవచ్చు (1 తిమోతి 5:17 చూడు). ఒకని మనం నాయకునిగా చేయడానికి ఏరుకోము; అతనిని తన పదవిలో పెట్టక ముందు గుర్తింపబడిన నాయకుడైయుండాలి. ఏదియెలాగున్నా, నడిపించడం అనే పౌలు ఉద్దేశానికి విశాలమైన వర్తింపు ఉండి ఉండవచ్చు. *Proistemi* తండ్రి తన కుటుంబాన్ని నడిపించడాన్ని వర్ణించడానికి ఉపయోగించబడింది (1 తిమోతి 3:4, 12).

(7) కనికరం చూపే వరం. "కనికరము చూపడానికి" వాడబడిన పదం *eleeo*, "ఒకని పట్ల దయ చూపుటయు," అది తిరిగి కార్యములో వ్యక్తపరచుటయునైయుంది.[14] ఇది బహుముఖమైన వరం: ప్రజలకు సహాయం ఎప్పుడు కావలెనో, సరిగా ఎలాటి సహాయం ఎక్కువ ప్రయోజనంగా ఉంటుందో ఎరిగి ఎక్కువ అలజడి లేకుండ అవసరతలను తీర్చుటయైయుంటుంది. దీనికంటె ఎక్కువ మేలు చేసే వరములు బహు తక్కువగా ఉంటాయి, అయినా యిది తరచుగా అత్యల్పమైన గుర్తింపు పొందుతుంది.

జాబితాన్ని మరోసారి వీక్షించు. కొన్ని వరాలు ప్రత్యేకించి మాటలాడడానికి సంబంధించినవే (ప్రవచించడం, ఉపదేశించడం, హెచ్చరించడం) మిగిలినవి పరిచర్య చేయడానికి సంబంధించినవి (సేవ చేయడం, ఇవ్వడం, నడిపించడం, కనికరం చూపడం). ఈ జాబితాగుండా వెళ్లుతుంటే, విదితంగా వ్యత్యాసమైన వరాలు కలిగియున్న ప్రజల యొక్క బైబిలు ఉదాహరణలను నీవు తలంచవచ్చు – వ్యక్తిగతంగా ఈ సామర్థ్యాలు గల ప్రజలను నీవు ఎరిగియుండవచ్చు.[15] వరాలను గూర్చి నేను చదివేటప్పుడు నా మనస్సుకు వచ్చే కొందరు యిక్కడ ఉన్నారు:

- ప్రవచన వరము – అగబు (అపొస్తలుల కార్యములు 11:28; 21:10, 11).
- ఇచ్చు వరము – యేసును ఆయన అపొస్తలులను ఆదుకొన్న స్త్రీలు (లూకా 8:1–3).
- హెచ్చరించు వరము – బర్నబా, "హెచ్చరిక పుత్రుడు" (అపొస్తలుల కార్యములు 4:36).
- పరిచర్య వరము – తరచుగా పౌలుకు సహాయం చేసిన ఫీబే (రోమా 16:1, 2).
- కనికరము చూపు వరము – దొర్కా, విధవరాండ్ర కొరకు దుస్తులు చేసినది (అపొస్తలుల కార్యములు 9:36, 39).

నాకు తెలిసినంతమట్టుకు, ప్రభువువారికి ఈ వరాలన్నీ ఉన్నాయి. మనకు వాటిలో

ఒకటో లేక కొన్ని మాత్రమే ఉంటాయి (మత్తయి 25:15తో పోల్చి చూడు).

**ఒక సవాలు**

వరాలను మనం పేర్కొంటుండగా, "ఒకవేళ దేవుడు ఈ వరము నాకు ప్రసాదించి యుండవచ్చునని" నీవు అన్నావా? సంఘంలోని ప్రతి సభ్యుడు (సభ్యురాలు) తన తలాంతు ఏదో తీర్మానించుకొని, దాన్ని ఉపయోగించడం కన్న ఎక్కువ ప్రాముఖ్యమైనవి కొన్నే. తాను చేయగలదానిని చేయడంలో ప్రతి ఒక్కరు బిజీగా ఉన్న స్థానిక సంఘాన్ని నీవు ఊహించగలవా? మంచికి ఆ స్థానిక సంఘం ఎంత బలీయంగా ఉంటుందో!

"దేవుడు నాకు ఏ వరము అనుగ్రహించాడో నేనెట్లు తెలిసికొనగలను?" అని యింతలో ఎవరో అడుగుతున్నట్టుంది. పలు రకాలైన సలహాలు యివ్వబడ్డాయి. సాధ్యమయ్యే ఒక విధానాన్ని James Baird అవుట్‌లైన్ చేశాడు:[16]

- నీవు చేయగలవాటిని వ్రాయి, చేయడంలో నేర్పు, చేయనిష్టపడడం.
- స్థానిక సంఘంలో చేయనవసరమైనవి వ్రాయి: ఆరాధనలో, పరిచర్య కార్యాల్లో, కొనసాగే అవసరతలలో, అవసరతలో ఉన్న సాటి సభ్యులకు, వగైరాలు.
- రెండు జాబితాలను పోల్చి చూడు. నీ తలాంతులు, సామర్థ్యాలు ఎక్కడ ఉపయుక్తంగా ఉంటాయో చూడ ప్రయత్నించు. అయినా, ప్రస్తుతం నీవు ఏమి చేయగలవో దానికే పరిమితి చేసికో. "నేను ఏ సామర్థ్యాలను పెంచుకొన గలను?" అని నిన్ను నీవే అడుగుకో.
- మార్గదర్శకత్వం కొరకు ప్రార్థించు. (ప్రతి విషయంలో ఈ పని జరగాలి.)
- ఇతరుల సలహాలను తీసికో: పెద్దలు, పరిచారకులు, సువార్తికులు, ఎదిగిన క్రైస్తవుల వద్ద.
- ఆలోచించడానికి సమయం తీసికో.
- చివరిగా, నీవు చేయగలదాని విషయంలో నిర్ణయం తీసికో. దానికి సమర్పించుకో, చేయనారంభించు.

ఒక విషయం జాగ్రత్త. "నాకు ఉపదేశించే వరముంది, కనుక నేను కనికరమును చూపనవసరం లేదు," లేదా, "నాకు హెచ్చరించే వరముంది, కనుక నేను యివ్వనవసరం లేదు" అని కొందరు ఊహించుకునే అవకాశముంది. బైబిలు ఆజ్ఞాపించినట్టుగా మనలో ప్రతి ఒక్కరు ఈ ఏడు వరములను ఉపయోగించుకోవలసిన అవసరత కొంతవరకైనా ఉంటుంది:

- సువార్త ప్రచారం, దేవుని పక్షంగా "మాట్లాడుట" (మత్తయి 28:19, 20; మార్కు 16:15, 16).

- పరిచర్య చేయుట (గలతీయులకు 5:13; రోమా 12:11).
- ఉపదేశించుట (హెబ్రీయులకు 5:12).
- హెచ్చరించుట (హెబ్రీయులకు 3:13; 10:24, 25).
- ఇచ్చుట (లూకా 6:38; రోమా 12:13; 1 కొరింథీయులకు 16:1, 2; 2 కొరింథీయులకు 8; 9).
- నడిపించుట (1 తిమోతి 3:4, 12). (సంఘ నాయకత్వం పురుషులకు పరిమితి చేయబడింది.)
- కనికరము చూపుట (లూకా 10:37; కొలొస్సయులకు 3:12).

క్రైస్తవులుగా మనం ఏమి చేయాలని నిర్ణయించడం, మన వరమేదో కనుగొనడం మీద ఆధారపడనవసరం లేదు. దీని విషయంలో బైబిలు అనేక సంగతులను తెలుపుతోంది. మన క్రైస్తవ పరిచర్య మీద నొక్కి చెప్పబడడం తీర్మానించబడాలి. నేను కాలేజీకి వెళ్లినప్పుడు, కృతార్థుడనవ్వడానికి పలు అంశాలు చదువవలసి వచ్చింది - వాటిలో ఇంగ్లీషు, చరిత్ర, సైన్సు అనేవి కూడ ఉన్నాయి. అయినా, బైబిలు, బైబిలుకు సంబంధించిన విషయాలు ఎక్కువగా చదివేవాడిని. కాలేజీలో ఉపయోగించిన భాష ప్రకారం "బైబిలు" అనేదే నా "ప్రధానాంశం." దీన్ని మన అంశంలో వర్తింపజేస్తే, మన వరము లేక వరములు మన ఆత్మ సంబంధమైన "ప్రధానాంశాన్ని" తీర్మానించవలసియుంటుంది.

దేవుడు మనకు వరాలను అనుగ్రహించాడు. వాటిని వాడునట్లు ఆయన మననుండి ఎదురు చూస్తాడు. నీ వరములేవో గుర్తించి, వాటిని ఉపయోగించడంలో ఎంతో గొప్ప ఫలితాలు కలుగుతాయి. క్రైస్తవుడిగా అది నిన్ను సంతోషపెడుతోంది. ("చివరిగా, సంఘంలో నా స్థానమేమో కనుగొన్నాను!" అని అంటున్నవారి ముఖాలలో చిరునవ్వును నేను నా మనస్సులో చూస్తున్నాను!) అది నిన్ను ప్రభువునకు నమ్మకస్థునిగా నిలుపుతోంది. అట్టిది సంఘాన్ని కట్టుతుంది (ఎఫెసీయులకు 4:12 చూడు). అది యితరుల జీవితాలను దీవిస్తుంది, మరియు అది దేవుని మహిమపరచుతోంది (1 పేతురు 4:11 చూడు).

## ... అప్పుడు దాన్ని ఉపయోగించు. (12:3-8)

**అది ఎందుకు వాడబడాలి?**

ఈ పాఠమంతటిలో, ఉపయోగించడానికి దేవుడు మనకు వరములనుగ్రహించాడని నేను అన్నాను. వచనం 6లో మనం యిలా చదువుతాం, "వెవ్వేరు కృపావరములు కలిగినవారమైయున్నాము ... పని కలిగియున్నాము" (6ఎ, బి వచనం). నా వద్దనున్న NASB ప్రతిలో, "అలాగుననే మనలో ప్రతి ఒక్కరు ఉపయోగించవలసియుంది" అనే తర్జుమాదారులచే చేర్చబడినట్టు ఇటాలిక్స్‌లో ఉన్నాయి. ఇంత దీర్ఘమైన ప్రయోగం వారు ఎందుకు చేర్చవలసియుంది? మన వరములు ఉపయోగించవలసిన అవసరత ఆ

మూల వాక్యమంతటిలో వ్యాపించియుంది. మన వరములను అనుగ్రహించింది దేవుడే అనే విషయాన్ని మరచిపోవద్దు (3, 6 వచనాలు). నీవు ఎవనికైనా ఒక బహుమానాన్ని యిచ్చావు, అది అతడు ఎన్నడూ వాడినట్టు కన్పించకపోతే, నీవు ఎలా ఫీలౌతావు?

మరల, శరీరంలోని సాటి "అవయవములమైయున్నట్టు" మనం మరచిపోకూడదు (4, 5 వచనాలు): "కండ్లు," "చెవులు," "చేతులు," "కాళ్లు," వగైరాలు. కన్ను చూడక పోయినట్టయితే, దాని ఉనికి యొక్క ఉద్దేశాన్ని అది కోల్పయింది; చెవి వినకపోయి నట్టయితే, దాని ఉనికి యొక్క ఉద్దేశాన్ని పోగొట్టుకున్నదైయుంది. పైగా, మన మూల వాక్యంలోని చివరి మూడు వచనాల్లో, మనం పలు రకాలైన వరములు కలిగియున్నది వాటిని ఉపయోగించడానికేనని నొక్కి చెప్పబడింది.

**అది ఎలా ఉపయోగింపబడగలదు?**

మన వరాలు కేవలం ఉపయోగించడం కాదు; అవి ఫలాని మార్గంలో అభ్యాసం చేయబడాలి. వరములలో కొన్ని ఉపయోగించడాన్ని గూర్చి పౌలు నోట్సు చేర్చాడు (ఈ పాఠంలో ముందుగా 1, 5, 6, మరియు 7 అంకెలను యివ్వబడినవాటిని చూడు).

(1) ప్రవచన వరము. "ప్రవచన వరమైతే విశ్వాస పరిమాణముచొప్పున ప్రవచింతము" అని పౌలు అన్నాడు (6సి వచనం). "పరిమాణము" అనేది *analogia* నుండి తర్జుమా చేయబడింది. (*Logos* ["వాక్యము"] అనేదానికి ముందు *ana* ["మీద," "పైన," లేక "మీదికి"].) దీనినుండే మనకు "analogy" అనే పదం వచ్చింది. *Analogia* అంటే, "పోలిక, నిష్పత్తి, భాగము" అని అర్థం.[17] "అతని విశ్వాసము" (నిజముగా "విశ్వాసమే") అది వచనం 3ను సూచిస్తుంది: దేవునిచే ప్రతి క్రైస్తవునికి కేటాయించబడిన "విశ్వాస ప్రమాణం." W. E. Vine యిలా వ్రాశాడు, "దేవుడు ఏది అనుగ్రహించాడో దాన్ని దాటి వెళ్లేదానికి వ్యతిరేకముగా హెచ్చరిక."[18] ప్రవక్త దేవుడు తనకు ప్రసాదించిన సందేశాన్ని మాత్రమే మాట్లాడాలి. పేతురు యిలా అన్నాడు, "ఎవడైనా మాట్లాడితే అతడు దేవోక్తులు బోధించినట్టు బోధించాలి" (1 పేతురు 4:11).[19]

(5) ఇచ్చు వరము. పౌలు యిలా అన్నాడు, "ఇచ్చువాడు ఔదార్యముతో" (8బి వచనం). "ఔదార్యము" (*haplotes*) అనేది *haplous*, అంటే "ఒంటరి." *Haplotes* "ఏకాగ్రతను సూచిస్తుంది," దానికి ఫలితము ఔదార్యము.[20] ఈ పదం యొక్క ప్రాథమిక అర్థాన్ని KJV ప్రత్యేకంగా చూపుతోంది: "ఇచ్చువాడు, నిష్కాపట్యంగా చేయనిమ్ము." దాన్ని నేను యిష్టపడతాను. నీవు యిచ్చేటప్పుడు, దాన్ని ఆడంబరంగా చేయకు (మత్తయి 6:2తో పోల్చి చూడు). దాని అంతిమ ఫలితాన్ని NASB నొక్కి చెప్పుతోంది: "ఔదార్యముతో." CJB రెండు భావనలను చేర్చుతుంది: "నిష్కపటంగాను, ఉదారంగాను చేయుము" అంటుంది.

(6) నడిపించే వరము. "నడిపించువాడు శ్రద్ధతో చేయాలి" అని పౌలు అంటున్నాడు (8సి వచనం). "శ్రద్ధ" అనేది *spoude* నుండి తర్జుమా చేయబడింది, "మనఃపూర్వకము, ఆసక్తి"[21] అని అర్థం. కొంత కాలానికి నాయకులు అలసిపోయినవారై తమ బాధ్యతలను నెరవేర్చడంలో అలక్ష్యాన్ని చూపవచ్చు. అటు స్థానిక సంఘాన్ని

నడిపించే పెద్దలేగాని, యిటు కుటుంబాన్ని నడిపించే తండ్రులేగాని, వారు తమ "బాధ్యతలను సీరియస్‌గా తీసికోవాలి" (NLT).

(7) కనికరమును చూపు వరము. చివరిగా, పౌలు యిలా అన్నాడు, "కరుణించువాడు సంతోషముతో పని జరిగింపవలెను" (8డి వచనం). "సంతోషము" అనేది *hilarotes* నుండి వచ్చింది, దీనినుండి "hilarity" మరియు "hilarious" అనే పదాలను మనం పొందాం. "సిద్ధమనస్సు ఆనందంతో దేనినైనా త్వరగా చేయ కోరేదాన్ని" *hilarotes* సూచిస్తుంది.[22] సణుగుకొంటూ లేక ముఖం మీద కోపంతో మండిపడినట్టుగా ఉండేది. మంచికంటె ఎక్కువ చెడ్డనే చేస్తుంది. Peterson పౌలు ఉపదేశాన్ని ఈ విధంగా విస్తరింప జేస్తున్నాడు: "దీనస్థితిలోనివారితో నీవు పని చేసినట్టయితే, వారియెడల విసుగుచెందకు, లేదా వారివలన నిరాశపరచబడకు. నీ ముఖం మీద చిరునవ్వుతో ఉంచుకో" (MSG). D. Stuart Briscoe యిలా రాశాడు, "కనికరము చూపు సామర్థ్యంతో ప్రత్యేకించి కలిగినవారు వారి రమ్యమైన వరము తెలియబడినప్పుడు, వారి సమయము బలముమీద హెచ్చుగా భారం పడడంవలన గర్వభంగమైనట్టు తలంచకూడదు."[23]

ప్రతి వరము ఉపయోగింపబడే విధానాన్ని వివరించడంలో పౌలు సమయాన్ని గడపలేదు. కాని మన సామర్థ్యాలను అభ్యాసం చేస్తూ ఉండగా అవసరమైన స్వభావ లక్షణాలపై అతడు కేంద్రీకరించాడు. వరములలో నాల్గింటిని గూర్చిన పౌలు ఉపదేశం ఏ వరమునైనా ఉపయోగించడానికి అవసరమైన మంచి సలహాతో కూడియుంది:

- నీ వరము ఏదైయున్నా, దేవుని వాక్యంతో నిలిచి, అది కలిగియున్న పరిమితులను అంగీకరించు.
- ప్రదర్శించడానికి, మనుష్యుల శ్లాఘ్యాన్ని పొందడానికి గాని నీ వరాన్ని ఉపయోగించకు.
- నీ వరాన్ని వాడడంలో ఆసక్తి కలిగియుండు.
- నీ వరమును గూర్చి సంతోషించు, సంతోషంతో దాన్ని ఉపయోగించు.

దేవుడు మనకు ప్రసాదించిన వేర్వేరు వరములపై నేను చివరి మాట చెప్పాలి. ఏ కార్య కలాపాలను స్థానిక సంఘం ప్లాన్ చేయాలో అనేదానిమీద వివిధ వరములు కలిగిన మనుష్యుల మధ్య విభేదాలు రావచ్చు. ఉపదేశించే వరం కలిగినవాడు, విద్యా ప్రోగ్రామే అంతా ప్రాముఖ్యమయ్యిందని తలంచవచ్చు; కనికరమును చూపు వరము గలవారు యితరులకు సహాయం చేయడం సంఘం యొక్క ప్రధాన కార్యక్రమమై ఉండాలని తలంచవచ్చు. అందరికి ఒకే వరము ఉండదనే వాస్తవాన్ని గుర్తుంచుకో. అన్ని వరములు ముఖ్యమైనవే. ప్రేమయు, ఐక్యతయు కలిగి, ప్రతి ఒక్కరు తనకు కలిగిన దానిని ఉపయోగించుతూ ఉండ నేర్చుకుందాం.

## ముగింపు

“ఒకనిని ప్రత్యేకమైనవానిగా చేసేదేమి?” అని అంటూ, నేను ఈ పాఠాన్ని ఆరంభించాను. లోకంలో ధనికులై, (పవర్‌ఫుల్) అధికారం గలవారై, టేలెంట్‌గలవారై యుండడంవలన ప్రత్యేకమైనవారైయుంటారు. అయినా, నీ ఆస్తి, అంతస్థు, టేలెంట్ మీద నీ విలువ ఆధారపడని స్థలం ఒకటి ఉంది. అది సంఘం, క్రీస్తు శరీరమైయుంది. అందులో, ప్రతి వ్యక్తియు అవసరమై, ప్రతి సభ్యుడును ముఖ్యమైనవాడైయుంటాడు.[24] నీవు యింకను క్రీస్తు శరీరములో అవయవముగా ఉండకపోయినట్టయితే, క్రీస్తునందు నమ్మికయుంచి బాప్తిస్మం పొందుమని నేను నిన్ను ప్రోత్సహిస్తున్నాను. ప్రభువు నిన్ను తన సంఘానికి చేర్చుకుంటారు (అపొస్తలుల కార్యములు 2:38, 47; KJV; 1 కొరింథీయులకు 12:13). తరువాత దేవుడు నీకు ప్రసాదించిన వరాన్ని కనుగొని, నిన్ను ప్రేమించు నీ ప్రభువును మహిమపరచడానికి ఉపయోగించు. ఇక్కడ భూమిమీద సంతోషంగా ఉండడానికిని, నిత్యత్వంలో దేవునితో ఉండడానికిని యిదియే మార్గం.

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

ఈ పాఠానికి మరో పేరు: “సంఘంలో నీ స్థానాన్ని కనుగొనుట.” ఈ పాఠంలో ప్రతి పాయింటుకు, ప్రత్యేకమైన స్టడీ వ్రాయాలని శోధింపబడ్డాను. మూల వాక్యానికి అనేకమైన వర్తింపులు చేయవచ్చు! కొన్నింటిని మాత్రమే నేను చూపించాను. నీ శ్రోతలకు అవసరమైనవాటిని నీవు ఏరుకోవచ్చు. నీవు పని చేసే చోట పనికి వచ్చే నీ ఆలోచనలను పెంచు.

“పని కొరకు పరిశుద్ధులను సన్నద్ధులుగా చేయడంకంటే” ముఖ్యమైన కార్యాలు కొద్దిగానే ఉంటాయి (ఎఫెసీయులకు 4:12). ఈ పాఠం యొక్క అభ్యాస సంబంధమైన వర్తింపుగా, ప్రతి వ్యక్తి తన వరాన్ని కనుగొనేలా స్థానిక సంఘ నాయకులు కొంత కాలం ప్రజలతో గడపవచ్చు.

సూచనలు

[1]నీవు నివసించే సమాజానికి ఈ జాబితాను వర్తింపజేసికో. [2]Joe Barnett, “You Are Someone Special” (tract) (N.p., n.d.), 6. [3]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine’s Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 583. [4]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph Henry Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 408. [5]“Function”కు బదులు KJVలో office అని ఉంది. నేడు ఆ పదం మరొక అర్థంలో వాడబడుతుంది. యిప్పుడు NKJVలో “function” అని ఉంది. [6]రోమా 12లోని చెప్పబడిన సందర్భంలో 1 కొరింథీయులకు 12, యింకా అనేక లేఖన భాగాలను కోట్ చేయవచ్చు. [7]నీవు నీ శ్రోతల యెదుట నిలిచినప్పుడు, నీవే “దృశ్య సాధనమైయుంటావు.” నీ దేహంలో ఆయా అవయవములను చూపవచ్చు. [8]ఈ జాబితాలో అద్భుతమైన, అద్భుతము కాని వరములు చేర్చబడినట్టు అనేకమంది రచయితలు

అంగీకరిస్తారు. కాని ఏవి అద్భుతమైనవి, ఏవి అద్భుతమైనవి కావు అనే విషయంలోనే తేడైన వ్యత్యాసముంది. [9]R. C. Bell, *Studies in Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1957), 136. [10]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, 1971), 354.

[11]Vine, 619. [12]"నేను వేడుకొంటున్నాను" *(parakaleo)* అని తర్జుమా చేయబడిన పదం "రూపాంతరము పొందిన జీవితం (12:1, 2)" అనే పాఠంలో చర్చించబడింది. [13]*The Analytical Greek Lexicon,* 265. [14]Vine, 404. [15]మీ స్వంత ఉదాహరణలను వాడండి. మీరు స్థానిక క్రైస్తవులను ఇలాంటి వరములను కొన్నింటిని పొందినవాళ్ళను కొందరిని చేర్చండి. [16]James O. Baird, "Going to Heaven from the Pew," sermon preached at Macquarie church of Christ, Sydney, Australia, July 1976. [17]*The Analytical Greek Lexicon,* 23 [18]Vine, 494. [19]రోమా 12:6సి కి సంబంధించి, " 'విశ్వాసానికి అనుకూలంగా ఈ ప్రయోగాన్ని తర్జుమా చేయాలని' John R. W. Stott అభిప్రాయపడ్డాడు. అంటే, 'తన సందేశం క్రైస్తవ విశ్వాసాన్ని ఏ విధంగాను ఖండించకుండునట్టు ప్రవక్త నిశ్చయం కలిగియుండాలి' " (John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series [Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994], 327). [20]O. Bauernfeind, *"haplotes,"* in Geoffrey W. Bromiley, *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel and Gerhard Friedrich, trans. Geoffrey W. Bromiley, abr. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 65.

[21]Vine, 169. [22]Ibid., 98. [23]D. Stuart Briscoe, *Mastering the New Testament: Romans,* The Communicator's Commentary Series (Dallas: Word Publishing, 1982), 222. [24]Barnett, 9-10.